క్లుప్తంగా

ఘనంగా అక్కినేని అఖిల్ పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న అఖిల్ అభిమానులు

విజయనగరం టౌన్: జిల్లా అక్కినేని ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్‌లో సినీనటుడు అక్కినేని అఖిల్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. థియేటర్ ఇన్‌చార్జ్ కుమార్‌తో కేక్ కట్ చేయించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమానులు కంటుభుక్త దుర్గాప్రసాద్, ధారా వెంకట్, అంజి శ్రీను, సంతోష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని బుచ్చన్న కోనేరు వద్ద ఉన్న 33 కేవీ ఫీడర్ లైన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ పి.నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు ఈ విషయం గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

విజయనగరం టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను కండక్టర్, ఆర్టీసీ అధికారులు సదరు వ్యక్తికి అందజేశారు. విజయనగరం నుంచి అలమండ వెళ్లే బస్సులో ప్రయాణిస్తున్న సతీష్ బస్సు దిగిన సమయంలో ల్యాప్‌టాప్‌తో ఉన్న బ్యాగును బస్సులో మరిచిపోయాడు. కండక్టర్ ఆ బ్యాగును గుర్తించి ఆర్టీసీ అధికారులకు అందజేశారు. బ్యాగ్‌లో ఉన్న ఐడీ కార్డు ఆధారంగా ప్రయాణికుడి వివరాలు తెలుసుకుని అతనికి సమాచారం ఇవ్వడంతో అతను డిపోకు వచ్చి బ్యాగును తీసుకున్నాడు. పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను అందించినందుకు ఆర్టీసీ ట్రాఫిక్ కంట్రోలర్ ఆదినారాయణ, దుర్యోధన, డ్రైవర్ వర్మ, కండక్టర్ సీహెచ్ సత్యంకు కృతజ్ఞతలు తెలిపాడు.

నేడు అలుగోలులో 'జగనన్నే మా భవిష్యత్'

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు, జోగిరాజుపేట గ్రామాల్లో ఆదివారం జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ గదల సన్యాసినాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు అలుగోలు గ్రామంలో చేపట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొంటారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించడంతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి



మంగళ్‌సింగ్ పాండే, బంకిమ్‌చంద్ర ఛటర్జీ చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: మండలంలోని గుండాలపేట ప్రాథమిక పాఠశాలలో తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమరయోధుడు మంగళ్‌సింగ్ పాండే, వందేమాతరం గేయ రచయిత బంకిమ్ చంద్రచటర్జీ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు ఫౌండేషన్ అధ్యక్షుడు బి.రామకృష్ణారావు, హెచ్‌ఎం ఎ.నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర సంగ్రామంలో వారి పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు.

జోహార్ సైనికా

చీపురుపల్లి: కోల్‌కత్తాలో పారా గ్లైడింగ్ శిక్షణలో ప్రాణాలు విడిచిన నేవీ మెరైన్ కమాండర్ చందక గోవింద్ మృతికి వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఉపాధ్యాయుడు ఎన్.బలరాం నేతృత్వంలో చందక గోవింద్ సంతాప సభ శనివారం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉపాధ్యాయుడు బలరాం మాట్లాడుతూ దేశ రక్షణ కోసం శిక్షణ పొందుతూ ప్రాణాలు కోల్పోయిన చందక గోవింద్ ఆదర్శప్రాయుడన్నారు. గోవింద్ జీవిత చరిత్రను చిన్న పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

జగనన్నతోనే బంగారు భవిష్యత్

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



భోగాపురం: గ్రామంలోని ఓ లబ్ధిదారుని ఇంటికి జగనన్న ఫొటోతో ఉన్న స్టిక్కర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ



భోగాపురం: బైరెడ్డిపాలెంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తూ.. ప్రజల బంగారు భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మళ్లీ రావాలని, అందుకోసం ప్రతీ ఒక్కరం సమష్టిగా పనిచేద్దామని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని బైరెడ్డిపాలెం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించడంతో పాటు గత ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ.. అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు సంక్షేమ పథకాల ద్వారా 2 లక్షల కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారులకు అందజేసి వారి కళ్లల్లో ఆనందాన్ని నింపారన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు. ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, సర్పంచ్ రాజు, సచివాలయ కన్వీనర్లు పడాల భానుప్రకాశ్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, పోతిరెడ్డి గోపిరావు, గృహసారథులు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: చల్లవానితోటలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పలనాయుడు, తదితరులు

కొండగుంపాంలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ పతివాడ అప్పన్న తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అభిప్రాయాలను సేకరించారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని జొన్నాడలో జరిగిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ కోటినాయుడు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో 'జగనన్నే మా భవిష్యత్' స్టిక్కర్లు చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పూసపాటిరేగ: రెల్లివలసలో సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న ఎంపీపీ కల్యాణి, కన్వీనర్ శ్రీనివాసరావు



డెంకాడ: జొన్నాడలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, తదితరులు

సుపరిపాలనే సీఎం జగన్ ధ్యేయం

పూసపాటిరేగ: ప్రజలకు మరింత మెరుగైన సుపరిపాలన అందించేందుకే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా రెల్లివలస గ్రామంలో శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాలన్నీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువ చేశారన్నారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని నమ్మొద్దని కోరారు. రెల్లివలసలో పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, మహంతి శ్రీనివాసరావు, పూసపాటిరేగలో సర్పంచ్ టొంపల సీతారాం, మహంతి జనార్దనరావు, మహంతి లక్ష్మణరావు, చౌడువాడలో మొంగం నాగబాబు, ఎల్లన్నరెడ్డి, కోనాడలో దాడిశెట్టి త్రినాథరావు, దాడిశెట్టి గోవింద, దారపు లక్ష్మణరెడ్డి, బొద్దు ఎల్లాజీ, గోవిందపురంలో డి.సునీత, ఈశ్వరరావు, పట్టెపు శ్రీనివాసరావు, జనపాల అప్పారావు, వెల్దూరులో దారపు అప్పలసూరి, కనిమెట్టలో శాంతాటి శ్రీను తదితరులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన

● ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి



ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న కోలగట్ల

విజయనగరం:

పార్టీలు, కులాలు, మతాలు ఇవేమీ చూడకుండా.. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 20వ డివిజన్‌లో శనివారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, స్థానిక కౌన్సిలర్లతో కలిసి కోలగట్ల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన సంక్షేమ లబ్ధిపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల నిధులను నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లోనే నిధులు జమ చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా లంచం అడుగుతున్నారా అని ప్రశ్నించగా.. అడగడం లేదని స్థానికులు చెప్పారు. ఇదే జగనన్న ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని కోలగట్ల కితాబునిస్తూ.. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డికి మీ ఆశీస్సులు అందించాలని కోరారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా సంక్షేమ పథకాలను అందిస్తూ పేదలను అభివృద్ధిలోకి తీసుకురావాలన్న దృఢ సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. మహిళల పేరుపై అనేక పథకాలు అమలు చేస్తూ.. నేరుగా వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నారన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కంటభుక్త తవిటిరాజు, డివిజన్ అధ్యక్షుడు పచ్చిగుళ్ల కృష్ణమూర్తి, కుమ్మరిగుంటి శ్రీనివాసరావు, సుధీర్, కాళ్ల సూరిబాబు, కనకలగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి



సచివాలయ కన్వీనర్లకు అవగాహన కల్పిస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జెడ్పీటీసీ సభ్యుడు, జేసీఎస్ మండల కన్వీనర్ గదల సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండవెలగాడ గ్రామంలో జేసీఎస్ సచివాలయ కన్వీనర్లతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ప్రజలకు అంతా మంచే జరిగిందని, ఆ విషయం ప్రజలకు కూడా తెలుసునన్నారు. జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని గ్రామాల్లో పక్కాగా నిర్వహించాలని, ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాలు సేకరించాలని సూచించారు. అనంతరం కన్వీనర్లకు ప్రచార కిట్లను సరఫరా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



కోలగట్లకు వినతిపత్రం ఇస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు

విజయనగరం: జిల్లా కేంద్రంలో దళిత ఉద్యమ నేత, భారతదేశ మాజీ ఉపప్రధాని దివంగత డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషిచేస్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు శనివారం సాయంత్రం కోలగట్లను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అంటరానితనం నిర్మూలన కోసం అహర్నిశలు పోరాటం చేసిన యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై కోలగట్ల సానుకూలంగా స్పందించారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న అల్లు అర్జున్ అభిమానులు

విజయనగరం టౌన్: సినీనటుడు అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంకీ ఆధ్వర్యంలో స్థానిక కాటవీధి బెస్త కాలనీ మందిరం వద్ద శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నగర మేయర్ విజయలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. అభిమాన హీరో పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నానాజీ, రంగనాయకులు, చక్రవర్తి, ముత్యాల నాయుడు, దాసుకుమార్, రాంబాబు, రవి, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

70 మందిపై బైండోవర్



మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

గజపతినగరం: ఎలాంటి లైసెన్స్ లేకుండా చిట్టీలు నిర్వహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని స్థానిక సీఐ ఎల్. అప్పలనాయుడు హెచ్చరించా రు. గజపతినగరం మండలంలో చిట్టీలు నిర్వహిస్తున్నవారితో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా చిట్టీలు ఎత్తుబడి చేసిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. అలాగే లైసెన్స్ లేని వారి వద్ద చిట్టీలు కట్టడం ప్రజలు తక్షణమే మానుకోవాలని సీఐ సూచించారు. మండలంలో అనుమతులు లేకుండా చిట్టీలు కట్టించుకుంటున్న 70మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ఇకపైన చిట్టీల నిర్వహణ పూర్తిగా మానుకోవాలని, లేకుంటే అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తామని అన్నారు. స్థానిక ఎస్ఐ గంగరాజు పాల్గొన్నారు.

సంపత్ వినాయకుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



జెడ్పీ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

సకల విఘ్నాలను తొలగించే సంపత్ వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. నగరంలోని కొత్తపేటలో మండపం వీధిలో ఉన్న సంపత్ వినాయక ఆలయం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట ఆలయ నిర్మాణకర్త ఎడ్ల పైడిరాజు, పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కేవీ సూర్యనారాయణరాజు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్ తదితరులు ఉన్నారు.

తుంపర సేద్యంతో నీటి ఆదా



తుంపర సేద్యం పరికరాలను పరిశీలిస్తున్న ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ

గంట్యాడ: తుంపర సేద్యంతో నీటి వృథాను అరికట్టవచ్చని ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బోనంగి గ్రామంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన తుంపర సేద్యం పరికరాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తుంపర సేద్యం పరికరాలను 50 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు. తుంపర సేద్యం వల్ల మొక్క ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం



కుమ్మపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వేపాడ: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సన్యాసమ్మ తెలిపారు.మండలంలోని కుమ్మపల్లి యూనిట్‌లో రైతులకు నవధాన్యాల సాగు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ ప్రధాన పంట సాగు చేసే ముందు పొలాల్లో 20 నుంచి 30 రకాల నవధాన్యాల విత్తనాలను చల్లి, 45 రోజుల తర్వాత చేనును భూమిలో కలియదున్నాలని చెప్పారు. ఇలా చేయడం వల్ల నేలలో నత్రజని, భాస్వరం, పొటాషియంతోపాటు సూక్ష్మపోషకాలు, జింక్, బోరాన్,మాంగనీస్ లాంటి 18 పోషకాలు భూమికి లభిస్తాయన్నారు. నేల గుల్లబారి మృదువుగా తయారవుతుందని, ప్రధాన పంటకు కలుపు సమస్య ఉండదని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. ఎన్‌పీఎం దుకాణాల్లో, రైతుభరోసా కేంద్రాల్లో నవధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఐసీఆర్పీలు వెంకటరావు, రమణమ్మ, నాయుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉపకరణాల ఎంపికకు గుర్తింపు శిబిరం రేపు

శృంగవరపుకోట/వేపాడ: ఎస్.కోట మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాలలో ఈనెల 10న విభిన్న ప్రతిభా వంతులకు ఉపకరణాల పంపిణీకి సంబంధించిన గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్.కోట, వేపాడ ఎంపీడీఓలు శేషుబాబు, బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయాల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు తమ పరిధిలో ఉన్న విభిన్న ప్రతిభా వంతులకు సమాచారం అందించాలని సూచించారు. మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్, వినికిడి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, మానసిక ప్రతిభావంత పిల్లలకు ఎంఎస్ఐఈడీ కిట్లు, సీపీ చైర్, బ్యాటరీ ఆపరేటెడ్ మూడు చక్రాల సైకిళ్లను అందించేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. శిబిరానికి హాజరయ్యే విభిన్న ప్రతిభావంతులు సదరన్ సర్టిఫికెట్, ఆదాయ ధృవ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు ఈ శిబిరానికి హాజరయ్యేలా చూడాలని గ్రామసచివాలయ సిబ్బంది, వలంటీర్లను కోరారు. గత మూడేళ్ల లోపు పరికరాలు పొందిన విభిన్న ప్రతిభావంతులు అనర్హులని పేర్కొన్నారు.